క్లుప్తంగా

26 మంది ఆర్పీఎఫ్ సిబ్బంది రక్తదానం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆర్పీఎఫ్ రైజింగ్ డే పురస్కరించుకుని విజయవాడ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది 26 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రైల్వే హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. సీనియర్ డీఎస్సీ వల్లేశ్వర బి.టి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ మధుసూదనరావు రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. అనంతరం సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల, ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిటీ హెడ్ సత్యనారాయణ దాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.


నేడు గుర్రం జాషువా జయంతి సభ

విజయవాడ కల్చరల్: ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో కవి కోకిల గుర్రం జాషువా 129 జయంతి సభను ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి పలువురు కవులకు జాషువా పేరిట నగదు పురస్కారం, సత్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీగా రామచంద్రరావు

విజయవాడస్పోర్ట్స్: వన్‌టౌన్ ట్రాఫిక్ ఏసీపీగా పి.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న ఆయన్ను ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించింది. ఏసీపీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న రెండు వాహనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వారు నిఘా పెట్టగా రెండు వాహనాల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లుగా గుర్తించి వాటిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేశారు. రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ఆ రెండు వాహనాల డ్రైవర్లు తన్వీర్, వినోద్‌ను విచారణ చేయగా సువ్వాడ గోపి అనే వ్యక్తి పిలవడంతో లోడ్ ఎక్కించుకొని వెళ్తున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ కాలనీలో బాధితులకు ఆహార పొట్లాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు ముంపు ప్రాంతం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని బాధితులకు నోవా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం ఆహార పొట్లాలను అందజేసింది. సంస్థ ప్రెసిడెంట్ పల్లెపోగు సలోమి ప్రసాద్ కాలనీలో మునిగిపోయిన ఫ్లాట్లకు వెళ్లి బాధితులను పరామర్శించి వారికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉంటాయని, అధైర్యపడవద్దని చెప్పారు.

చురుగ్గా కల్వర్టు గేటు పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద నివారణ చర్యల్లో భాగంగా అయోధ్యనగర్ నుంచి బుడమేరులోకి వెళ్లే మురుగుకాలువ కల్వర్టుకు గేటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జేసీబీతో మురుగుకాలువను సరిచేసి గేటు ఏర్పాటు చేస్తున్నారు. అయోధ్యనగర్ తదితర ప్రాంతాల్లో వాడిన నీరు బుడమేరులోకి వెళ్లేలా పనులు జరుగుతున్నాయి. శుక్రవారం గేటు పనులను స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

టూరిజంలో విస్తృత ఉపాధి అవకాశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): టూరిజంలో ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చరిత్ర విభాగం ఆధ్వర్యాన ప్రపంచ టూరిజం డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె టూరిజం ప్రాముఖ్యాన్ని వివరించారు. అధ్యాపకులు డాక్టర్ ప్రకాశం, డాక్టర్ ఎం.హరిప్రసాద్ టూరిజంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు వినియోగించుకోండి

గొల్లాస్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ సేవలను వినియోగించుకుని జీవితంలో లక్ష్యాలు చేరుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గొల్లాస్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద, అనారోగ్య,



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు, ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, తదితరులు

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. మేనేజింగ్ ట్రస్టీ గొల్లా హనుమాన్‌గుప్తాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు తమ కళాశాలతో పాటు ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 21 మంది మెరిట్ విద్యార్థులకు రూ. 2.10 లక్షలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. సిద్ధార్థ మహిళా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఎం.కనకారావు డాక్టర్ ఎం.విజయసారథి, ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ యుగంధర్ ట్రస్టీలు జి. విజయశ్రీ గుప్తా, మాటూరు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్, ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల కారణంగా సెంట్రింగ్ సామగ్రి, ఆటో,గూడ్స్ వెహికిల్ యజమానులు తీవ్రంగా నష్టపోయారని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సెంట్రింగ్ సామగ్రి ఖాళీస్థలాల్లో పెట్టుకుంటారని, చెక్కలు, కర్రలు వరదకు కొట్టుకుపోయి యజమానులు పూర్తిగా నష్టపోయారన్నారు. వీరికి నష్ట పరిహారం నమోదు చేసే సమయంలో అధికారులు డోర్ నంబర్ కావాలని, వ్యాపార సర్టిఫికెట్లు కావాలని అడిగారన్నారు. అంతా కార్మికులేనని వారికి సర్టిఫికెట్లు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. ఒక్కో యజమానికి రూ. 3 నుంచి రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. వారిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నష్టపరిహారం అందజేయాలని కోరారు. ఆటో, మినీ గూడ్స్ వెహికల్స్ డ్రైవర్ వారి వాహనాలకు ఫైనాన్స్ కంపెనీలు వివిధ రకాల ఆటంకాలు పెట్టడంతో కార్మికులు అప్పులు చేసి రిపేర్ చేయించుకుంటున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చేయించుకున్న ఆటోడ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. వీటన్నిటిపై ప్రభుత్వం సమగ్రమైన అంచనా వేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాజీ, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్.కనకరావు, శ్రీను, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కృష్ణానదిలోకి కలుషిత నీరు

నిర్ధారించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

పెనమలూరు: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి కలుషిత నీరు పవిత్ర కృష్ణానదిలోకి వదులుతున్నారని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిర్ధారిస్తూ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రామలింగేశ్వరనగర్‌లో 20 ఎంఎల్‌డీ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఉంది. ఈ ప్లాంట్‌లో మురుగునీరు శుద్ధి చేసి అనంతరం వృథా నీటిని కృష్ణానదిలోకి నేరుగా వదులుతున్నారు. అయితే సీవేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ కారణంగా ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్థానిక నివాసితులు ఆందోళన చెందుతున్నారు. నదిలోకి వ్యర్థాలతో ఉన్న నీటిని ప్లాంట్ నుంచి విడుదల చేయడంతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలతో ఉన్న నీటిలో దిగిన పలు పాడి గేదెలు కూడా మృత్యువాత పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన వెలగపూడి బాబూరావు గ్రీన్ ట్రిబ్యునల్‌లో(ఎన్‌జీటీ) కేసు వేశారు. దీనిపై ఎన్‌జీటీ వాస్తవాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీ కంట్రోల్ బోర్డును ఆదేశించింది. అయితే గత ఆగస్టు 9వ తేదీన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేసి శాంపిల్స్ తీశారు. ఎనాలసిస్ నివేదిక ప్రకారం సీవేజ్ ప్లాంట్ నుంచి విడుదలవుతున్న నీటిలో ఉండాల్సిన ప్రమాణాల కన్నా టోటల్ డిస్సాల్వ్‌డ్ సాలిడ్స్(టీడీఎస్)బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడి) ఎక్కువగా ఉన్నాయని గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక సమర్పించారు. ఈ వ్యవహారంపై గ్రీన్ ట్రిబ్యునల్ ఇవ్వనున్న తుది ఆదేశాలపై స్థానికులు ఎదురుచూస్తున్నారు.



సీవేజ్‌ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

ఖాతాదారులకు మెరుగైన సేవలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వివిధ భాషలను అధ్యయనం చేయడంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించవచ్చని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం (ముంబయి) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్ అన్నారు. హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యాన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో శుక్రవారం హిందీ భాషా ప్రాంతాల నుంచి పనిచేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులకు ప్రాంతీయ భాషకు తెలుగులో ప్రావీణ్యత పొందడానికి శిక్షణ తరగతులను ప్రారంభించారు. సభకు హిందీ ప్రచారసభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కవ్‌డే, జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, పరీక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్ పురీ, కన్వీనర్, శృతికాంత్ భారతి, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, విజయవాడ జోనల్ కార్యాలయం అధికారి సి.వి.ఎస్. భాస్కర్‌రావు తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన తెలుగు భాష ఎంతో గొప్పదన్నారు. హిందీ భాషా ప్రాంతాల నుంచి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి, తెలుగు భాష అనర్గళంగా మాట్లాడడానికి తరగతులు చాలా బాగా ఉపయోగపడతాయన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ కార్యాలయం పరిధిలోని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు వివేక్ సుధతోపాటు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



తరగతులు ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

క్రీడలపై అవగాహనతో నిర్ణయాలు తీసుకోండి

సీఎం చంద్రబాబుకు సీనియర్ క్రీడాకారుడు కేపీ రావు సూచన

విజయవాడస్పోర్ట్స్: క్రీడలపై పూర్తిగా అవగాహన లేని అధికారుల నివేదికల ఆధారంగా క్రీడాభివృద్ధిపై నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం చంద్రబాబుకు సీనియర్ క్రీడాకారుడు కేపీ రావు సూచించారు. ఈ నెల 26వ తేదీన క్రీడా శాఖపై జరిగిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను పునరాలోచించాలని కోరుతూ సీఎంకు శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఇండోర్ స్టేడియంలను ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు ఆక్రమించేశారని, వారంతా వ్యాయామం కోసం వాటిని వినియోగించుకుంటూ.. క్రీడాకారులను రానివ్వడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో మరో 35 ఇండోర్ స్టేడియంలను నిర్మించడానికి రూ.23 కోట్లు మంజూరు చేయడం వృథా అని అభిప్రాయపడ్డారు. ఈ నగదును గ్రామీణ క్రీడల అభ్యున్నతికి ఉపయోగించాలని సూచించారు. 2019లో ఇదే తరహాలో నిర్ణయాలు తీసుకుని అబాసుపాలైన వైనాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని సీఎంకు సూచించారు. అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, సీనియర్ క్రీడాకారులతో చర్చలు జరిపి క్రీడల అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ఆర్థిక భారం పడకుండా పీపీపీ విధానంలో క్రీడలను అభివృద్ధి చేయడానికి ఆలోచన చేయాలని సూచించారు.

దుర్గమ్మ చెంత భక్తిరంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నెల్లూరుకు చెందిన భారతీ సంగీత విద్యాలయానికి చెందిన పలువురు కళాకారులు కర్ణాటక గాత్ర సంగీతాన్ని ఆలపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శుక్రవారం సాయంత్రం జరిగిన సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలు కీర్తనలను కళాకారుల బృందం చక్కటి గాత్రంతో ఆలపించారు. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ప్రతి ఒక్కరికీ అమ్మవారి ఆశీస్సులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మధురానగర్ శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే ఉమా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చురుగ్గా పైప్‌లైన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదలకు పాడైన యూజీడీ, వాటర్ పైపులైన్‌ల స్థానంలో నూతన పైపులైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు మధురానగర్ నుంచి దేవీనగర్ వైపు వచ్చే పైపులైన్‌లు ఫుట్‌బ్రిడ్జి మీదగా ఉండేవి. బుడమేరు వరద ఈ పైపులైన్‌ల మీదుగా వెళ్లింది. దీంతో ఇప్పుడు మధురానగర్ నుంచి దేవీనగర్‌కు వెళ్లే వంతెనల ఫుట్‌పాత్‌ల మీదుగా నూతన పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

బీఓఐ ప్రత్యేక 400 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ ఇండియా పండుగ సీజన్ పురస్కరించుకుని ప్రత్యేక 400 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ఏడాదికి 8.10 శాతం వడ్డీతో అందిస్తుందని బ్యాంక్ జోనల్ మేనేజర్ ముత్తా వీవీ బంగారాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3.00 కోట్ల కంటే తక్కువ బకెట్‌లో ప్రత్యేక 400 రోజుల రిటైల్ టర్మ్ డిపాజిట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. సూపర్ సీనియర్ల కోసం ఆకర్షణీయమైన వడ్డీ 8.10 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.95 శాతం, ఇతర కస్టమర్‌లకు 7.45 శాతం వడ్డీ అందిస్తారని తెలిపారు. ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ అన్ని బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో ఈనెల 27వ తేదీ శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. మరింత సమాచారానికి సమీపంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిల్లో స్వయంగాగానీ, బీఓఐ ఓమ్ని నియో యాప్ ద్వారా కానీ పొందవచ్చని ఆయన తెలిపారు.

వృద్ధులకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన దాత కంది హేమంత్‌రావు సహకారంతో శుక్రవారం సాయంత్రం వృద్ధులకు అన్నదానం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. వృద్ధులకు అన్నదానం చేయడానికి సహకరిస్తున్న హేమంతరావును అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, కోరంగి నాగమల్లి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లు, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల నుంచి ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన నిందితుడిని విజయవాడ జీఆర్‌పీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి అతని నుంచి రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ రమణ తెలిపిన వివరాల ప్రకారం రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు .. విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. పార్వతీపురంజిల్లా పూటికవలస గ్రామానికి చెందిన తంగుడు రామకృష్ణ అనే యువకుడు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగులను సోదా చేయగా రెండు ల్యాప్‌టాప్‌లు లభ్యమయ్యాయి. వాటిని రైళ్లలో ప్రయాణికుల నుంచి చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. దీనిపై నిందితుడిని అరెస్టు చేసి రూ. 1.70 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

నేడు చంద్రబాబు పాప ప్రక్షాళనకు పూజలు

మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తిరుపతి లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను అపవిత్రం చేసిన చంద్రబాబు పాపానికి ప్రక్షాళనగా.. ఈనెల 28వ తేదీ శనివారం రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పూజలకు పార్టీ అధిష్టానం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9.30 గంటలకు సత్యనారాయణపురం గాయత్రీ కన్వెన్షన్ సెంటర్ పక్కన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

విద్యాదానం ఎంతో గొప్పది

ఎంఈఓ వెంకటరత్నం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అన్ని దానాల్లో కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని.. వరద ముంపు ప్రాంతాల్లో పుస్తకాలను కోల్పోయిన విద్యార్థులకు దాతలు అండగా నిలవడటం ఆనందదాయకమని విజయవాడ నార్త్ మండల ఎంఈఓ ఆదూరి వెంకటరత్నం అన్నారు. స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుడమేరు వరదల్లో పుస్తకాలను కోల్పోయారు. వారి అవస్థలను గుర్తించిన హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ముందుకు వచ్చి విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎదుటివారు ఎవరైనా ఆపదల్లో, ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తోచిన సాయం చేయాలని సూచించారు. హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ సహృదయంతో వరదల్లో చిక్కుకున్న విద్యార్థులకు బాసటగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మట్ట శ్రీనివాసరావు, ఐజాక్ శ్రీహాస్, డి.సురేష్, బిందు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆపద వేళ ఆదుకున్న ఆర్‌యూబీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు చూపుతో నిర్మించిన ఆర్‌యూబీ ఆపద వేళ ఆదుకుంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ. 17 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆర్‌యూబీ బుడమేరు వరద సమయంలో సహాయక చర్యలకు కేంద్రంగా మారింది. బుడమేరు వరద ఉధృతికి రామకృష్ణాపురం, దేవీనగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో సహాయక చర్యలకు మధురానగర్ ఆర్‌యూబీ మీదుగానే సాగాయి. ఇక్కడ ఆర్‌యూబీ అందుబాటులో ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా కొనసాగించారు. రాకపోకలకు సైతం ఎటువంటి ఇబ్బందులు కలగలేదు. ఇక్కడ ఆర్‌యూబీ కనుక పూర్తవ్వకపోతే దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన వారు బయటకు రావాలంటే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వరద సమయంలో నిత్యావసర సరుకులను సైతం అందజేయడానికి బీఆర్టీఎస్ రోడ్డు నుంచి ఆర్‌యూబీ ద్వారా రాకపోకలు సాగించారు.



మధురానగర్ ఆర్‌యూబీ

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలు శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో శుక్రవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ..జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం తెలుగు విభాగం అంతర్జాలంలో ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో చీరాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కట్టిపోగు సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని 'జాషువా కవిత్వతత్వం' అనే అంశంపై ఉపన్యసించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలు.. మాదక ద్రవ్యాల వాడుకతో జీవితాలు అంధకారంగా మారతాయని.. ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని అంగన్ వాడి సెంటర్‌లో 'మత్తు పదార్థాలు-సోషల్ మీడియా దుర్వినియోగం'పై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ముఖ్యమని, వీటిని రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వీటి నియంత్రణకు ఉద్యమంలా.. సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా దుర్వినియోగంతో మంచి కన్నా చెడు ఎక్కువగా అలవాటవుతోందన్నారు. ఫోన్ల వాడకంతో మెదడుపై తీవ్ర ప్రభావం పడి శారీరకంగా, మానసికంగా సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇలాంటి సమస్యలకు సైకియాట్రిస్ట్, సైకాలజిస్టుల అనుభవం కలిగిన నిపుణులతో నీతోడు మానసిక వికాసకేంద్రాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.నాగమణి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ దేవమణి, వాంబేకాలనీ అంగన్‌వాడీ సెక్టార్ విభాగాల టీచర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న శేఖర్‌బాబు

నైపుణ్యం పెంపుతో విజయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు వ్యాపార రంగంలో రాణించాలంటే అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నరేంద్రకుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మీట్‌ది సీఈవో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరేంద్రకుమార్‌తో ముఖాముఖి జరిగింది. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రాణించాలంటే ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచి సమస్యలను పరిష్కరించే చొరవ, ఆలోచనా విధానాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఒకటి రెండు అపజయాలు ఎదురైనా ధైర్యంగా వాటిని ఎదుర్కొని ముందడుగు వేయాలని చెప్పారు. సంపూర్ణ జ్ఞానం పెంచుకుంటే విజయాలు వరిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించే దిశగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

